సాధారణంగా ప్రేమను తెలుపుకోవడానికే కానుకలిస్తారు. ప్రేమను తెంచుకోవడానికిచ్చిన ఆ అసాధారణ కానుకేమిటి?

రోహిణీకార్తె అందరిమీదా సమానంగా నిప్పులు కురిపించి యిక.... ఈరోజుకు చాల్లే అనుకుంది. చీకటి మూడు గంటలయి చోటు చేసుకున్నా యింకా భూమి సెగలు కక్కుతూనే వుంది. మురికివాడలో వూరిసరిహద్దుమీదగుడిసెల్లో వున్నవాళ్లుతమతమగూటికిచేరుకుంటున్నారు.

పగటి ఎండా శ్రమా మరచిపోయేందుకు కడుపునిండా మందు సేవించిన పోలయ్య తన గుడిసెముందు నవారు మంచం మీద కడుపురాసుకుంటూ "సారాతాగినా సుకమేలేదు, ఇదేంటి కాలం యిట్టా తగలడింది" అంటూ స్వగతంలో పలుకుతూ సగం కాల్చిన బీడీ తీసేడు.

ఇలాంటి పరిసరాల్లో పోలయ్య బీడీ వెలిగించి "ఎదవ కంపు వాసన సగం కాలిన బీడీయే!" అని తుపుక్కున ఉమ్మి— మరో క్షణానికి కళ్ళు మూసుకుని పొగ తన్మయత్వంలో మునిగిపోయేడు.




మోరీమీద దోమలు మందు కొట్టిన పక్షుల్ని చూసి యిక డిన్నర్ మొదలు పెడ్దాం అనుకుంటున్నాయి. పెళ్ళికాని పోచయ్య ఆడోళ్ళనందర్నీ దొంగచూపులు చూస్తూ సుఖం పొందేస్తున్నాడు. అనుమానాల అచ్చియ్య పెళ్ళానికి ఈ రోజు కొత్త రంకు అంటగట్టి ఏడు తరాల అటు వైపు వాళ్ళ జాతకం వల్లెవేస్తున్నాడు.

త్రాగుడికే అంకితం అయిన ఏలేశ ఎప్పటిలాగే మురికి కాలువ దాటలేకపోతున్నాడు. దూరంలో యిద్దరు కుర్రవెధవలు నిక్కర్లమీద కొట్టుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గంజాయి కొట్టిన బూరగాలు జంగమయ్య బ్రహ్మంగారి పాటల్ని ఎత్తుకున్నాడు.

"మావో" అంటూ చెవిలో కఠోరంగా వినబడితే కళ్ళుతెరచి, "మళ్ళీ ఏం తన్నీసినావే!" అంటూ పోలయ్య లేచి గుడిసెలోకి వెళ్ళి కుంపటిమీద కుండను తన్నేసిన భార్యతో "నీతో సావొచ్చిందే గుడ్డిమా

లోకమా! తిన్నావుకదే! ఒకమూల కూర్చో కుండా అన్నీ కాలితో తన్నేసుకుంటూ యిట్లా గుడిసెంతా తిరుగుతావేంటి!" అంటూ కసురుకుని రెక్కపటుకుని "పద అవతల కూర్చో" అని బయటకి తీసుకొచ్చి కూర్చోబెట్టి "ఉండు గోనెవరుస్తా! కూర్చుందువుగాని" అంటూ గోనె పరిచేడు. పోలయ్య భార్య నడుం చేరేసింది.

గుడిసె శుభ్రంచేసి బయటికి వచ్చి మంచం ఎక్కిన పోలయ్యకు రంగి తన ముందునించి పోతూ కనిపించింది. ఉషారు ఎక్కువయిన పోలయ్య "వొసేయ్ రంగీ అట్లా పరుగులెట్టకపోతే ఒక్క నిముషం ఆగి నాతో ఒక్కమాటమాట్లాడకూడదే!"

"కావాల్సి తెచ్చుకున్న గుడ్డి ముండ వుందిగా దాన్ని పక్కలో ఏసుకొని ఊసులాడు" అంటూ రుసరుసలాడుతూ పోబోయింది.

"దాంతో ఆడితే నీతో ఆడినట్టు ఎక్కడ ఉంటుందే?"

"అయితే ఏ బుద్ధితో దాన్ని పెండ్లి సేసుకున్నావ్" అంటూ నడక సాగించింది.

"బుద్ధిలేక సేసుకున్నానే. అక్కడ అందరూ బస్సులకి ఎగబడుతూంటే ఈముద్దె రిచ్చాలికి బేరాలే లేవు. అసుంటిది యిదేమొ ఆ గంజినీల్లూ వొంపేసి. ఆ కుండలూ యిరిసేస్తది. ఏది యిర్సేసినామొ అన్న యిశారం అయినా లేకుండా ఎట్టా నిదరబోతూందో!" అని గొణుక్కున్నాడు.

"ఏంటి మావా! మల్లీ నన్నే ఆడిపోసుకుంటున్నావా?" అంటూ పలవరింతలా అడిగింది.

"ఏం లేదే అన్నిటికీ నువ్వేకర్తివి. నువ్వు పడుకో" అంటూ కసిరేడు.

"నీకు నన్ను సూస్తే ఎప్పుడూ కోపమే! గుడ్డిముండను అనేకదా యిట్టా సీత్కారం పడుతున్నావ్. నా ప్రారబ్దం యిట్టా వుంది" అంటూ మెల్లగా కూని రాగాలు తీయసాగింది.

"సీసీ, యింటిలోనూ. బయటా యింత మనశ్శాంతిలేదు!" అనుకుంటూ మంచం మీదనించి లేచి గుడిసెకు దూరంగా వున్న సారాకొట్టు సీనయ్య పాకలో దూరి. "వొహో వొక ముంత యియ్యి" అన్నాడు.

"కూసో" అని ముంత అందించి, ఏంటి పోలయ్యా. యీమద్దె మల్లామల్లా వొచ్చి తాగుతున్నావేంటి? మనసేం బాగుండటం లేదా!" అని అడిగేడు.

పోలయ్య మాట్లాడలేదు. ముంత తీసుకొని తాగసాగేడు.

సీనయ్యకి పోలయ్యని చూస్తే అభిమానం. పోలయ్య గురించి అందరికీ తెలుసు. ఒకప్పుడు జూదగాడు. తాగుబోతూ. తిరుగుబోతూ. ఆవేశానికి మారుపేరు అయిన పోలయ్య పెండ్లి అయింతర్వాత మహాబుద్ధిమంతుడు అయిపోయేడు. అన్నీ మరచిపోయేడు. రెండేళ్ళు సుఖపడ్డాడు. తర్వాత పెళ్ళాం కళ్ళు అమ్మవారొచ్చి పోయేయి. పెళ్ళాం గుడ్డిది అయినా పెళ్ళాన్ని అభిమానించేడు. ప్రొద్దున లేస్తూనే నీళ్ళు నల్లానించి



ప్రముఖ పుస్తకములు
పోస్టు ద్వారా పొంది నెలకు
రూ 1,000/- సంపాదించండి

టి.వి. రేడియో&ట్రాన్సిస్టర్ గైడ్ ఒక్కింటికి 35/-. టైలరింగ్&కటింగ్ గైడ్ 12/50, కామసూత్ర (వాత్స్యాయన) 15/-. వైవాహిక జీవితం 12/50, ఫొటోగ్రఫీ 12/50, సెక్స అట్లాస్ (యు.ఎస్.ఏ) ప్రచురణ 15/-, 68 పడక గది బొమ్మలు 15/-, డ్రాయింగ్&పెయింటింగ్ 15/-, కోక్ శాస్త్రం (112 బొమ్మలతో) 15/- పోస్టేజి రు 4/- అదనం.

STAR BOOK DEPOT (AJ)
Chhapeti, Aligarh

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనా సరే వానిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి. Address :
Shri Vastav Pharmacy
P. o. Katrisarai (GAYA)

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,
టి.బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

తెచ్చేవాడు. కాఫీ పెళ్ళానికికాచిపోసి రిక్షా లాగేందుకు వెళ్ళేవాడు. మధ్యాహ్నం వొచ్చి యింత ఉడికించి పెళ్ళానికి పెట్టి తను యింత తిని కుండలు కడిగి పోయేవాడు. తిరిగి రాత్రి వొచ్చి వంట చేసే వాడు.

నాలుగు రోజులకొకసారి పెళ్ళాన్ని రిక్షాలో కూర్చోపెట్టి తనే తొక్కుకుంటూ ఊరంతా తిప్పి ప్రతివింతనీ తనకొచ్చే భాషలో వర్ణించి చెప్పేవాడు.

ఇంటి పనితో, బయటి పనితో మరీ అలసి ఎప్పుడేనా తన దగ్గరికి ముంతకి వస్తే "పోలయ్యా వయస్సులో వున్నావు. నీ బతుక్కి ఒక సుఖమా, సంతోషమా ఆ గుడ్డి పెళ్ళాంతో! మళ్ళీ మనువు ఎందుకు ఆడవు?" అనేవాడు.

"ఎందుకు సీనయ్యా, ఈ బతుకే బాగుంది. యిందులో ఏం తక్కువొచ్చింది" అనే పోలయ్య మూడేళ్ళ క్రిందట ఒకరోజు "సీనయ్యా నేను మళ్ళీ పెళ్ళి చేసుకొందాం అనుకుంటున్నా" అన్నాడు.

తను ఆశ్చర్యంనించి తేరుకోకమునుపే "నాకు తండ్రిని కావాలని వుంది. పెండ్లాం గుడ్డిదయినా పరవాలేదు. గొడ్రాలు మాత్రం కాకూడదు" అన్నాడు పోలయ్య.

ఆరోజు తను సంతోషించేడు. పోలయ్యతో తనూ వొక ముంత తాగేడు. తర్వాత పోలయ్య రెండు సంబంధాలు చూసేడని తెలిసింది. అంతే! తర్వాత పోలయ్య ఆసంగతే ఎత్తలేదు. తనే ఉండబటలేక వొకసారి అడిగేడు "యిక ఆ సంగతి ఎత్తవు" అన్నాడు కఠినంగా పోలయ్య.

తర్వాత సీనయ్య పెళ్ళిగురించి అడగ లేదు

పోలయ్య రెండో ముంత ఖాళీచేస్తూంటె చెవిటోడు, అవిటోడు రంగయ్య, రంగి మొగుడు కుంటుకుంటూ వచ్చి బెంచీమీద పోలయ్య ఎదురుగుండా కూర్చున్నాడు.

మనస్సు తెలికవుతూంటే కనురెప్పలు ఎత్తి పోలయ్య చూసి "రంగా బాగా ఉన్నావా" అన్నాడు, చాలా మటుకు సౌంజ్ఞల రూపంలోనే. తలాడించాడు రంగడు.

"యింట్లో పెళ్ళాన్ని పెట్టుకుని యిట్లా కల్లు పాకలమీద పడ్డావేంటి" అంటూ సౌంజ్ఞలతో అడిగేడు పోలయ్య.

వాడు అదెక్కడికి పోతుంది. అది ఎప్పుడూ యింట్లో వుండేదేగా అన్న భావంతో నవ్వి- "గుడిసెలోంచి చూసిని నీ మంచం కాలీగా వుంది. నువ్వు యీడ వుంటావని వచ్చినా" అని సీనయ్యతో "పోలయ్యమావ పేర ఒక ముంతయియ్య" అన్నాడు.

సీనయ్య పోలయ్యని ప్రశ్నార్థకంగా చూశాడు.

పోలయ్య యివ్వు అన్నట్టు తలాడించేడు.

"రంగివాస్తేకట్టం" అన్నాడు సీనయ్య.

"యియ్యకపోతే వీడితో కట్టం" అన్నాడు పోలయ్య. సీనయ్య ముంత అందించేడు.

రంగయ్య వొక ముంత ఖాళీచేసి రెండో ముంత అందుకుందాం అని నోరు ఎత్తే లోపల రంగి గుమ్మంలో నిలబడి నమిలేసే కన్నుల్తో చూస్తూ "యిక్కడున్నావా! అక్కడ గెంజికి కుంపటిమీద నీళ్ళు పడేసే లోపల దాటుకుంటివి కదే. పద తాగుబోతోడా. పొగలంతా రెక్కలు యిర్చుకుని కట్టం చేయాల. రాత్రి నిన్న ఎతుక్కుంటూ కల్లుపాకలు తిరగాలా!" అంటూ అరుస్తున్న రంగివైపు తలె ఎత్తకుండా లేచి బయలుదేరాడు.

"సీ, వొక్కసారిచెప్తే బుద్దుండాలి" అంటూ తుపుక్కున ఉమ్మేసి రంగి వెనక్కి తిరిగింది.

విషాదంగా వొక్క నిట్టూర్పు విడిచి పోలయ్యకూడా లేచేడు. అతని వొళ్ళంతా తేలికగా ఉంది. తూలుతూ గుడిసెవైపు నడక సాగించేడు.

ముందర రంగీ, దాని మొగుడు. వాడు బరువంతా దానిమీద వేసి నడుస్తున్నాడు. వాడి బరువుకి ప్రొద్దుటినించి పనులుచేసి అలసి ఉన్న రంగి అప్పుడప్పుడు వొరిగిపోతోంది.

రంగిని అలా చూస్తూంటే బాధనిపించింది. ఈ కుంటోడు, చెవిటోడు, తాగుబోతు గురించి యిది ఎంత కష్టపడుతుంది. దీనికి అలుపంట్టూ లేదేమొ!

"అమ్మా" అంటూ రంగి కొడుకు తల్లిని చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చేడు

"ఏందిరా?" అంటూ అంత చీదరలో ఆశక్తతతో ఆప్యాయంగా పలుకరించింది.

"నాకేమొ బయం ఏసింది! నీవు ఎక్కడికెల్లేవే?"అంటూ వాడు కుచ్చిళ్ళు పట్టుకుని సాధిస్తున్నాడు.

"నీ అయ్యదగ్గరకు ఎల్లేన్లే. యిట్టాంటి అయ్యలుఉన్నంత సేపూ నీలాంటివాల్లకూ, నాలాంటి వాల్లకూ బయమేనే" అంది. ఈ మాటలు పోలయ్య చెవిలో శూలాల్లా తాకేయి.

"తాగినా సుకంలేదు" అనుకుంటూ

గుమ్మంలో వున్న మంచంమీద వొరిగి పోయాడు పోలయ్య.

రాత్రి మానసికంగా అలుపు శరీరాన్ని మద్దగా తయారుచేస్తుంది. ప్రొద్దున్న ఏడయినా కడుపులో చేతులు, కాళ్ళు ముడుచుకొని పడుకున్న పోలయ్యను అతని భార్య రెండోసారి లేపింది. చానీల్లు కాసి యియ్యే అంటూ.

"ఉండే అంటూ" అటు వొత్తిగిల్లి పడుకున్నాడు.

ఇంతలో "పోలయ్యమావా" అంటూ పిలుపు వినబడింది నిద్రమత్తును వొదిలించే పిలుపు. అలుపును పోగొట్టేపిలుపు అటు తిరిగి చూసేడు. ఆరేళ్ళ కిటుడు నల్లగా, బొద్దుగా ఉన్నాడు. వాడు రోజూ దేనికోదానికి అతనివద్దకు వస్తూంటాడు. వాడ్ని చూస్తే పోలయ్యకు అభిమానం. ఆ సంగతి కిటుడికి తెలుసు అందుకే వాడికి కష్టం వొచ్చినా సుఖం వొచ్చినా పోలయ్య దగ్గరకె పరిగెత్తుకుంటూవసాడు.

"పోలయ్య కళ్ళు చిలికించి ఏంటిరా" అన్నాడు

"ఏంలేదు యియాల నా పుట్టిన దినం అంట: అమ్మ కొత్తచొక్కా కొంది. నువ్వేం కొంటావే?"

చంగున లేచి కూర్చున్నాడు పోలయ్య. పోలయ్య ముఖం పువ్వులా విచ్చుకుంది. కిట్టునిదగ్గరకు తీసుకుంటూ "నీకేంకావాలే" అన్నాడు ముద్దాడుతూ.

"లేవడమే ఆలీసం లేసినావు. ఇంక ఊరందరి పిల్లల్నీ ముద్దాడుతూ కూర్చుంటే పనులన్నీ ఎప్పటికి తెములాల లెగు" అంటూ అతని భార్య అదిలించింది

"ఉండవే" అంటూ భార్యని విసుక్కుని "నీకేం కావాలె చెప్పు కిటూ" అన్నాడు.

"నాకా నాకా" అంటూ ఆలోచిస్తున్నాడు. ఇంతలో రంగి మహంకాళిలా ప్రవేశించి "నికేరా చెప్పేది. తలంటి పోసుకోరా అని కుంకుడికాయలు దంచుతూంటే యిక్కడ దిగబడ్డావ రా" అంటూ కసిరింది

"అమ్మా పోలయ్య మావేమొ నాకు"

"నీకు, నాకు ఏమీఎవరూ అక్కరలేదు పద" అంటూ చేయి పుచ్చుకొని లాక్కెళ్ళింది.

పోలయ్య ఆనందం చిచ్చుబుడ్డిలాగా దిగిపోతూంది.

"అయిందిగా ఆ సంబరమేమొ. అందరూ ప్రొద్దున్నే ఆడిపోసుకుంటేనేకాని నీకు తెల్లారినట్టు ఉండను" అంటూ చిటపటలాడింది పోలయ్య భార్య.

ఈ మాటలు ఏమి వినని వాడిలా పోలయ్య తన విధుల్లో మునిగిపోయేడు.

* డైరెక్టుగా (1 సం॥లో) ఇంటర్; B.A/B.Com; M.A/M.Com.
* B. A/B. Com డిగ్రీ ఎంట్రన్సు (ఆంధ్ర)
* ప్రైవేటుగా LAW / B.Ed / M. B. A / D. B. M / I. C. W. A
పోస్టల్ / ఓరల్ కోచింగ్.... ప్రాస్పెక్టస్ రు. 5/-

ప్రసాద్ కామర్స్ కాలేజి
బృందావన్‌గార్డెన్స్ * గుంటూరు 522006.

* APPSC; రైల్వే సర్వీస్; BANK Exams; C. A. ఎంట్రన్సు పరీక్షలకు ప్రత్యేక శిక్షణ హాస్టల్ వసతులు కలవు.

జయశ్రీ మాస పత్రిక

ప్రత్యేక సంచిక (1980) మీరు చదివారా?

ఆంధ్ర దేశంలోని సుప్రసిద్ధ రచయిత(త్రు)ల రసవత్తర కథలతో రమ్యమైన వ్యాసాలతో, రమణీయమైన కవిత్వంతో వెలువడింది అందమైన బహువర్ణ ఆఫ్‌సెట్ ముఖచిత్రం. 1/4 డెమీ సైజు-విడి ప్రతి వెల రు 6/-మాత్రమే

'జయశ్రీ' మాస పత్రిక, దుర్గాఅగ్రహారం, విజయవాడ-2.

రుచికరమైన మెత్తని వడలు క్షణంలో!



ఓర్కే
ఇన్‌స్టెంట్ వడ మిక్స్
జామూన్ మిక్స్, దోశ మిక్స్ కూడా దొరుకుతాయి.




శ్రీ రామకృష్ణ డయిరీ
179, విశ్వేశ్వర పురం
బెంగుళూర్ 560 004
టెలిఫోన్: 603482

Dattaram RD 6



ఇటీవల భీమవరం త్యాగరాజ భవనంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో నిర్వహింపబడిన సంక్షేమ అష్టావధానంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సి. ఎన్. చంద్రశేఖర్ అష్టావధాని శ్రీ నరాల రామారెడ్డిగారిని సన్మానిస్తున్నప్పటి చిత్రం.

---

ఆ రోజంతా రిక్షా లాగుతూనే ఉన్నాడు పోలయ్య- బేరం చేయకుండా డబ్బు ఎంతిస్తే అంత తీసుకుని వొక్క నిముషం కూడా ఆగకుండా సంపాయిస్తున్నాడు. తను యీ రోజు డబ్బు సంపాదించాలి. కనీసం వొక పదిహేను అయినా. అప్పుడు ఆలోచించాలి కిట్టుడికేమి కొనాలో.

మధ్యాహ్నం వొంటిగంట అయింది. జ్యేష్టమాసం సూర్యుడు వొక్క వెలుగు వెలుగుతున్నాడు. రిక్షా త్రొక్కి త్రొక్కి కాళ్ళు లాగేసున్నాయి. ఇంతలో ఇల్లు జ్ఞాపకం వచ్చింది. తనెళ్ళి తన భార్యకు గంజికాయాలి. అది తనచేతుల్తో కాసిపోసే దాక కడుపు కాల్చుకుంటుంది. గుడిసె. భార్య జ్ఞాపకం రాగానే రిక్షాని యింటివైపు మళ్ళించేడు. పెద్ద వీధులు. చిన్న వీధులు వన్ వేలూదాటి మురికికాలువదాకా వచ్చేడు. అక్కడ ఆ ఎండలో కాళ్ళు కాలుతూంటే కిట్టు ఉష్ అనుకుంటూ కొత్త చొక్కాతో పరుగులాంటి నడకతో యింటివైపు పోతూ కనిపించేడు.

"వొరేయ్ కిట్టుడూ. ఈ ఎండలో ఎక్కడికిరా?" అని రిక్షా దిగేడు.

కిట్టు పోలయ్యవైపు తిరిగేడు. ఆరేళ్ళ వాడి చేతిలో ముంత

కిటుని అలా చూడగానే పోలయ్య కోపంతో ఊగిపోతూ "యిదేందిరా" అన్నాడు.

"అయ్య ముంత తెమ్మన్నాడే. ఆడికి కాలు బెనికిందంట. నన్ను సంపిండు"

పోలయ్యకు అవిటివాడిమీద పట్టలేనంత ఆగ్రహం వచ్చింది "ఆరేళ్ళు నిండని కిట్టుని కల్లుపాకకు పంపిస్తాడా? ఆడు మడిసేనా" అని అనుకుని-

"కూసోరా" అంటూ కిట్టుని రిక్షాలో కూర్చోబెటి బలంగా తొక్కసాగేడు.

రెండు నిమిషాల్లో రంగడి గుడిసె ముందు చేరి "వొరేయ్ రంగా" అంటూ గాండ్రిస్తూ లోనికి ప్రవేశించి మంచంలో పడుకుని గుడిసె కప్పుకేసి చూస్తున్న రంగడ్ని బలంగా వొక్క తన్ను తన్నేడు.

అర్భకంగా ఉన్న రంగడు "అమ్మో నన్ను సంపేసున్నాడ్రో" అంటూ మంచం మీదనించి ఎగిరి క్రిందపడ్డాడు.

లోపల్నించి రంగి పరిగెత్తుకుంటూ వొచ్చి క్రోధంతో "వాడ్ని యిటా అయినా బ్రతకనివ్వవా" అంటూ అరిచినంత పని చేసింది.

"ఆడు చేసిన ఎదవ పనికి యీ సేతుల్తోనే సంపేయాలే" అంటూ కసిగా చూసేడు పోలయ్య.

రంగడికి పెదాల కదిలికే కనిపిస్తూంది కాని శబ్దం వినిపించటంలేదు.

"అసలు సంగతి చెప్పకుండా ఏంటి అట్టా చిందులు తొక్కుతావు" అంటూ అసహనంగా అడిగింది రంగి.

"అసలు సంగతి ఏమని చెప్పనే రంగీ ఎటా చెప్పనే. కిట్టుడికి కల్లుపాకలకిపోయే వయస్సుందే! యీడు-యీతొత్తు కొడుకు కిట్టుని కలుపాకకు పంపించేడు కల్లు అట్టుకు రమ్మని" అంటూ దీనంగా అన్నాడు

"ఆడి కొడుకుని ఆడు కల్లు పాకలకు అంపుకుంటాడు. మధ్య నువ్వెవరు ఆడ్ని అడగడానికి?"

"అవునే రంగీ నేను వోరినీ కాదే. అందుకే నువ్వు ఆడి గురించి రెక్కలు తెగ్గొటుకున్నా చూసూ వూరుకున్నా. పాచి పనిచేసి కూరలు అమ్మి అలిసొచ్చిన నిన్ను ఆడు బూతులతో, దెబ్బలతో పూజ చేసినా ఊరుకొన్నా. కాని ఆడు కిటుడిచేత కల్లు తెప్పిస్తే నేను వోరోలా ఊరుకోలేక పోయేనే! కిట్టుడి తండ్రిలాగే బాధపడ్డానే. ఎందుకే రంగీ-నువ్వు చెప్పే."

రంగి కళ్ళ ముందర లీలగా గతం! పెరు పచ్చిపూ, జూదగాడూ, తిరుగుబోతూ అయిన పోలయ్య మాటలకు కరిగిపోయి వాడ్ని మనస్ఫూర్తిగా ప్రేమించడం ఫలితంగా కడుపులో కిట్టు పడటం. తరువాత పోలయ్య కనబడకపోవడం. భయంతో చచ్చిపోదాం అనుకోవడం. కాని కడుపులోని పోలయ్య గుర్తు తన్ను చావకుండా చేయడం. బ్రతికిఉండి కడుపులోని బిడ్డకు తండ్రిని ప్రసాదించడం, తగినంత సమయం లేకపోవడంవల్ల కుంటోడూ, చెవిటోడూ అయిన వీడ్ని కట్టుకోవడం. వీడితో కష్టపడడం. తర్వాత పోలయ్య యిక్కడ ఉన్నాడని, గుడ్డి పెళ్ళాంతో కాపురం చేస్తున్నాడని తనకు తెలియడం. యింకా పోలయ్యమీద అభిమానం చంపుకోలేక వాడికి దగ్గరగా వొక గుడిసె తీసుకోవడం- రంగి కళ్ళముందర తిరిగింది.

"కిటుడ్ని కల్లుముంతతో చూసి తల్లిలాగ నువ్వెంత బాధపడ్డావో నేనూ అట్టానే పడ్డానే రంగీ. యికనించి మీరు నా దగ్గర వుండకపోతే నా కిట్టుడిని యీ తాగుబోతోడు ఏంచేస్తున్నాడో అని నేను బాధపడుతూంటానే; నా దగ్గరికి వచ్చేసేందే! మిమ్మల్ని నా ప్రాణంగా చూసుకుంటానే!"

ఆశ రంగిని బలంగా లాగుతూంది.

తను ఏంచేయాలి?

వొక్క క్షణం కళ్ళు మూసుకుంది.

"అమ్మా" అంటూ పిలిచాడు కిట్టు.

"ఏంటిరా?" అంటూ కళ్ళు తెరిచింది.

"అయ్య తెలివితప్పిందే" అన్నాడు.

"అయ్య" ఆ మాట తన కర్తవ్యం స్ఫురింపజేసింది. ఆమె కళ్ళలో ఆశ. ఆతృతా మాయం అయింది. మోహాతీతమైన చూపుల్తో పోలయ్యనుచూస్తూ "మావా యీడు నీ కొడుకు యీడికి అయ్య నిద్దామనే ఈ రంగడ్ని పెళ్ళిచేసుకున్నా.

ఇప్పుడు నేను నీతోపోతే అందరూ నీ కిట్టుని లేచిపోయినదాని కొడుకు, వుంచుకున్న దాని కొడుకు అంటారు. నీ కొడుకుని అందరూ అట్టా అంటూంటే భరించగలవా?"

పోలయ్యలో ఆగ్రహం దిగిపోయింది.

మత్తు వొదిలినవాడిలా, వివేకం జనించినవాడిలా. తల ఊపుతూ వెనక్కి తిరిగేడు. తనకొడుక్కి వొక అయ్య కావాలి.

"కిట్టుడూ నీ పుట్టిన రోజుకు నీకు అయ్యను యిస్తున్నారా. అంతకంటే ఎక్కువ ఏమీ యీయలేనురా" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయేడు.